క్లుప్తంగా

ఒంటిమిట్ట రామయ్య సన్నిధిలో ఎమ్మెల్యే శ్రీదేవి



ఆలయ రంగమండపంలో ఎమ్మెల్యే శ్రీదేవి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిన సీతారామ లక్ష్మణులను మంగళవారం పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంఛనాలతో ఆమెకు స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ గావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగమండపంలో సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నాడు -నేడు పనుల పరిశీలన

నందవరం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మన బడి నాడు- నేడు పనుల్లో భాగంగా మంగళవారం కాంక్రీట్ స్లాబ్ పనులను ఎంఈఓ, పీఆర్ ఏఈ పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. కేజీబీవీ స్కూల్‌కు రాష్ట్ర ప్రభుత్వం 8 అదనపు గదులు మంజూరు చేసిందన్నారు. ఇందుకోసం రూ.96 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. 8 గదులకు స్లాబ్, కాంక్రీట్ పనులు పూర్తయినట్లు తెలిపారు. పనుల నాణ్యతను పరిశీలించినట్లు చెప్పారు.

మునిరంగస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తుగ్గలి: లింగనేనిదొడ్డి సమీపంలోని కొండపై వెలసిన మునిరంగస్వామి తిరునాల ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. నంద్యాల పక్కీరప్ప తాత ఆశీస్సులతో పూజారి కృష్ణారెడ్డి తిమ్మగురుడు, ముని రంగస్వామి, ఇతర దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, కళ్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం తిమ్మగురుడు, మునిరంగస్వామి రథాలను భక్తులు లాగారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

విజేత పుచ్చకాయలమాడ వృషభాలు

తుగ్గలి: మునిరంగస్వామి తిరునాల సందర్భంగా మంగళవారం లింగనేనిదొడ్డి సమీపంలోని కొండపై నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీల్లో పుచ్చకాయలమాడ వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీలను బహుమతి దాతలు కుమ్మరి నెట్టింకటయ్య, బొందిమడుగుల వైఎస్సార్‌సీపీ నాయకుడు మునిరెడ్డి ప్రారంభించారు. పోటీలలో పుచ్చకాయలమాడ ధనుంజయ వృషభాలు నిర్ణీత సమయంలో రాతిదూళాన్ని 3,933 అడుగుల దూరం లాగి విజేతగా నిలవగా, ఆ తర్వాతి స్థానాల్లో కొచ్చెర్వు బజారి లక్ష్మీదేవమ్మ, చింతలరేవు ఆంజినేయులు వృషభాలు, కర్నూలు రమేష్ నాయుడు వృషభాలు, పగిద్యాల సుధాకర్ వృషభాలు, సోములదొడ్డి రామాంజినేయులు వృషభాలు నిలిచాయి. విజేతలకు దాత కుమ్మరి నెట్టింకటయ్య రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20వేలు, నాలగవ బహుమతి ఫీల్డ్ అసిస్టెంట్ మునిస్వామి, ఐదవ బహుమతి మునిరెడ్డి రూ.5 వేలు అందజేశారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని బొమ్మిరెడ్డిపల్లెలో మంగళవారం ఏబీఎం చర్చి సంఘం ఆధ్వర్యంలో గిరకబండి పోటీలు నిర్వహించారు. 15 జతల ఎద్దులు పాల్గొనగా బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన మనోజ్ ఎద్దులు విజేతలుగా నిలిచి రూ.10,016 గెలుచుకున్నాయి. ద్వితీయ, తృతీయ స్థానాలలో లద్దగిరి బీఎస్ఆర్ ఎద్దులు, లక్ష్మీపురం చిన్నయ్య ఎద్దులు నిలిచి వరుసగా రూ.5,016, రూ.3,016 గెలుచుకున్నాయి. దాతలు మల్లెపల్లె వెంకటేశ్వర్లు, నరసింహులు, సునీల్ కుమార్, చర్చి సంఘం పెద్దలు విజేతలకు బహుమతులందించారు.

ధర్మానికి కట్టుబడి ఉండాలి



రామళ్లకోట ఆలయంలో త్రిదండి రామానుజ జీయర్, రాఘవ ప్రపన్న జీయర్ స్వామీజీలు

వెల్దుర్తి(కృష్ణగిరి): ధర్మాన్ని ఆరాధిస్తూ, మంచిని ఆదరించాలని, పరమత సహనం పాటించాలని విజయవాడ కామకోటినగర్ అష్టాక్షరీ పీఠం అధిపతి త్రిదండి రామానుజ జీయర్ స్వామీజీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగరాజ్ త్రిదండి రాఘవ ప్రపన్న జీయర్ స్వామీజీ సూచించారు. వారు మంగళవారం వెల్దుర్తి మండలం రామళ్లకోటలోని మహిమాన్విత వైష్ణవ క్షేత్రం, సత్యపీఠం కలిగిన భూదేవి, శ్రీదేవి సమేత వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యపీఠంపై కూర్చొని ప్రవచనాలు ప్రబోధించారు. గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చెక్

- హంద్రీ – నీవా నీటి పంపింగ్‌తో నిండుకుండలా మద్దమ్మకుంట
- బోర్లు, బావుల్లో పెరిగిన భూగర్భ జలాలు
- వీధుల్లో ట్యాంకుల ఏర్పాటుతో పరిష్కారమైన నీటి సమస్య



నిండుకుండలా మద్దమ్మకుంట

మద్దికెర: మండలంలో పెద్ద గ్రామం. వేసం వచ్చిందంటే చాలు నిత్యం నీటి సమస్య. ప్రతి ఏటా పంచాయతీకి అదనపు భారం. ట్యాంకులతో నీటి సరఫరా అయినా తీరని దాహార్తి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హంద్రీ – నీవా కాలువ గ్రామ పరిసరాలలో ప్రవహిస్తుండడంతో మద్దమ్మ కుంటలోకి నీటిని పంపింగ్ చేసి తాగునీటి సమస్యకు చెక్ పెట్టారు. మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలో 30 వేలు జనాభా, 4,400 ఇళ్లు ఉన్నాయి. గ్రామానికి నీరందించే వనరు చెరువు, బుగ్గ వాటర్ స్కీం, నంద్యాల నీటి పథకం కింద మూడు నీటి పథకాలు పలు బోర్లు ఉన్నాయి. ఇన్ని ఉన్నా ప్రతి ఏటా ప్రజలు నీటి సమస్యతో అల్లాడిపోయేవారు. ఏటా ట్యాంకులతో నీటి సరఫరా చేసినా ప్రజలకు సరిపడేది కాదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే నాయకులు చొరవ తీసుకొని హంద్రీ – నీవా కాలువ నుంచి నీటిని పంపింగ్ చేసేలా దాతలు అర్ధగేరి రామకృష్ణారెడ్డి కుటుంబీకులను సంప్రదించి రూ.3 లక్షలు చెల్లించే విధంగా ఒప్పించారు. మొదటగా వ్యవసాయ విద్యుత్ సరఫరాతో నీటిని పంపింగ్ చేశారు. కానీ సమృద్ధిగా నీరందలేదు. కొద్దిమేర నీటి సమస్య తీరింది. మద్దికెరకు నీటి సమస్య తీరాలంటే కుంటలో నీరుంటే గ్రామంలో బోర్లు, బావుల్లో నీరు సమృద్ధిగా ఉంటుందని, నీటి సమస్య పరిష్కారానికి ఇదొక్కటే మార్గం అగుపించింది. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి జిల్లా విద్యుత్ అధికారులను సంప్రదించి నీటిని పంపింగ్ చేసేందుకు పంచాయతీ వారు రూ.13 లక్షలు చెల్లించడంతో నిరంతర విద్యుత్ సరఫరా ఇచ్చేలా కృషి చేశారు. దీంతో మద్దమ్మకుంటకు నీటిని పంపింగ్ చేయడంతో నిండుకుండలా కళకళలాడుతోంది. గ్రామంలో కొళాయిల్లో నీరు, అంతేగాక బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరగడంతో నీటి సమస్య తీరింది. పంచాయతీ వారు గ్రామంలోని కాలనీలలో ఉన్న బోర్ల వద్ద దాదాపు 40 నీటి ట్యాంకులు ఏర్పాటు చేసి నిరంతరం నీటిని అందించేలా చర్యలు చేపట్టడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ప్రధానబజారులో నీటిని పట్టుకుంటున్న జనం



మద్దమ్మబావిలో సమృద్ధిగా ఉన్న నీరు

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



గ్రామంలో నీటి సమస్య ఎలా పరిష్కరించాలో తెలియక మొదట్లో ఇబ్బందులు పడ్డాం. ఎమ్మెల్యే సహకారంతో కుంటకు నీటిని పంపింగ్ చేయడంతో గ్రామంలోని కాలనీల్లో ట్యాంకులు ఏర్పాటు చేసి నిరంతరం నీటిని సరఫరా చేస్తున్నాం.

– బండారు సుహాసిని, సర్పంచ్, మద్దికెర

ఇబ్బందులు తొలగాయి



ప్రధాన బజారులో ఉన్న కొళాయి నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. గతంలో నీటి కోసం వెళ్లాలంటే భయమేసేది. వంతులు పెట్టుకొని గంటల తరబడి వేచిఉండి నీటిని తెచ్చుకోవాల్సి వచ్చేది. ఇప్పుడలా లేదు ఉదయం, సాయంత్రం రెండు సార్లు నీటిని సరఫరా చేస్తుండడంతో మాకు నీటి సమస్య తీరింది.

– కాశీం , గ్రామస్తుడు

ట్యాంకు ఏర్పాటు చేశారు



గతంలో చేతిపంపును కొట్టి నీటిని తీసుకెళ్లాల్సి వచ్చేదు. బోరులో తగినంత నీరు రాక ఆయాసంతో ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం బోరు వద్ద ట్యాంకు ఏర్పాటు చేయడంతో నీటి సమస్య తొలగిపోయింది. ఎప్పుడు కావాలంటే అప్పుడు కొళాయిల ద్వారా నీటిని పట్టుకునే అవకాశం కలిగింది.

– శంకర్, గ్రామస్తుడు

అంగన్‌వాడీ సిబ్బందికి న్యాయం చేస్తాం



ఆలూరులో మంత్రి గుమ్మనూరు జయరాంకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆలూరు: అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్ల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక మంత్రి నివాసానికి తరలివచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉందన్నారు. తెరవెనుక నుంచి రెచ్చగొట్టే వారి మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఆ యూనియన్ నాయకురాలు ఉన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం

ఈనెల 28న హాలహర్వి మండలం గూళ్యంలో శ్రీ గాది లింగప్ప తాత ఉత్సవాలకు హాజరుకావాలని కురువ సంఘం నాయకులు రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, మల్లప్ప తదితరులు మంత్రి గుమ్మనూరు జయరాంకు ఆహ్వానపత్రం అందజేశారు.

సమాజ సేవలో ముందుండాలి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

ఎమ్మిగనూరుటౌన్: సీపీఐ శ్రేణులు ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుడాలని డీఎస్పీ సీతారామయ్య, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ వద్ద సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సీపీఐ, నాయకులు భాస్కర్‌యాదవ్, దాదావలి, జబ్బార్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: పట్టణ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ సీతారామయ్య తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు శాంతి భద్రతలు కలిగించే విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్యలపై పోలీసులు దృష్టి సారించాలని తెలిపారు. రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా తగిన ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. టౌన్ సీఐ మదుసుధన్‌రావు, టౌన్ ఎస్ఐలు మస్తాన్‌వలి, రమేష్‌బాబు, ట్రాఫిక్ ఎస్ఐ సురేన్ బాబు, ఏఎస్ఐలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠశాలకు విరాళం

చిప్పగిరి: స్థానిక కేజీబీవీలో మౌలిక వసతుల కల్పనకు ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సాయం అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా పల్లకీసేవ

గోనెగండ్ల: మండల కేంద్రంలో చింతలాముని స్వామి జయంతి వేడుకలు మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. మూల విరాట్‌కు తుంగభద్ర జలాభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవ నిర్వహించారు.

రెచ్చగొట్టేందుకే తప్పుడు ప్రచారం

- ఈనాడు, ఆంధ్రజ్యోతి కథనాలపై వలంటీర్ల ఆగ్రహం
- సేవ చేసే అవకాశం కల్పించిన జగనన్న వెంటే ఉంటామని పునరుద్ఘాటన
- సమ్మెకు దిగుతున్నారంటూ పచ్చ పత్రికల్లో ప్రచురితమైన వార్తలపై ఖండన

ఆస్పరి: జీతాలు పెంచాలనే డిమాండ్‌తో వలంటీర్లు సమ్మెకు దిగబోతున్నారని మంగళవారం ఈనాడు, ఆంధ్రజ్యోతి దిన పత్రికల్లో ప్రచురితమైన కథనాలు పూర్తి అవాస్తవమని ఆస్పరి వలంటీర్లు గఫూర్, హనుమన్న, మంజునాథ్, అఖిల, బి.శారద, సి, శారద, శివ, అరుణమ్మ, ప్రవంతి, నరసింహా, వీరేష్ స్పష్టం చేశారు. ఆ పత్రికల్లో వచ్చిన వార్తలను ఖండించారు. మంగళవారం ఆస్పరిలో వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి వలంటీర్లును నియమిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. పార్టీలకతీతంగా పేదలకు ప్రభుత్వ పథకాలు అందిస్తూ దేశంలో ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన ఆశయసాధన మేరకు వలంటీర్లు సేవలందిస్తూ ప్రజల నుంచి మన్ననలు పొందారని వివరించారు. వలంటీర్లలో గందరగోళం సృష్టించేందుకు ప్రతిపక్ష నాయకులు పచ్చ పత్రికలను అడ్డంపెట్టుకుని పన్నాగం పన్నుతున్నాయని మండిపడ్డారు. సమాజంలో తమకు గౌరవమిస్తున్నారంటే అది జగనన్న వల్లనే అన్నారు. ప్రతి నెలా అవ్వాతాతలకు పింఛన్లు ఇచ్చేందుకు వెళ్లినప్పుడు తమను కుటుంబ సభ్యుల్లాగా అప్యాయంగా మాట్లాడుతుండడం ఎంతో సంతృప్తినిస్తోందని చెప్పారు.

పేదలకు సేవ చేయడం సంతృప్తిగా ఉంది



వలంటీర్‌గా పేదలకు సేవ చేయడం సంతోషంగా ఉంది. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ పథకాలు అందించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ పెట్టి తమ గౌరవం పెంచారు. అలాంటి జగనన్నకు వ్యతిరేకంగా సమ్మెకు దిగబోతున్నామన్నది అబద్ధం. – బి.శారద, వలంటీర్, ఆస్పరి

అవ్వాతాతల కళ్లలో ఆనందం చూస్తున్నాం



ప్రతి నెలా 1వ తేదీ అవ్వాతాతలకు పింఛన్ అందిస్తూ వారి కళ్లలో ఆనందం చూడడం ఎంతో సంతృప్తినిస్తుంది. వలంటీర్ల సేవల ద్వారా పేదలు, నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి ఎంతో మేలు జరుగుతుంది. మాకు గౌరవ వేతనం కంటే ప్రజలు ఇస్తున్న మర్యాద ముఖ్యం. ప్రతి పథకాన్ని అర్హులైన లబ్ధిదారుల చెంతకు చేర్చే బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా సమ్మె చేయలేం.

– అఖిల, వలంటీర్, ఆస్పరి

గందరగోళం సృష్టించడానికే తప్పుడు రాతలు



వలంటీర్లలో గందరగోళం సృష్టించడానికే ఈనాడు, ఆంధ్రజ్యోతి దిన పత్రికలు పనిగట్టుకుని తప్పుడు రాతలు రాస్తున్నాయి. సమాజ సేవ చేయడానికి అవకాశం కల్పించడం మహా భాగ్యం. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేం. ఎవ్వరు ఎంత రెచ్చగొట్టినా మేం సమ్మె చేయం.

– గఫూర్, వలంటీర్, ఆస్పరి

జగనన్న వెంటే..



ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆశయ సాధనే మా లక్ష్యం. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా మాలాంటి నిరుద్యోగ యువతకు గౌరవ వేతనం అందిస్తూ ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించారు. గతంలో వలంటీర్లు వైఎస్సార్‌సీపీకి చెందినవారంటూ ప్రచారం చేసిన పత్రికలు ఇప్పుడు సమ్మె చేస్తున్నారని రాయడం ఎంత వరకు సబబు. ఇలాంటి చౌక బారు వార్తలు రాయడం మంచిది కాదు.

– శివ, వలంటీర్, ఆస్పరి

రైతుల నిరసన

ఆస్పరి: రీసర్వేలో భూవిస్తీర్ణంలో వ్యత్యాసం ఏర్పడుతోందని, పాత పద్ధతి ప్రకారం భూముల వివరాలు ఉండాలని డిమాండ్ చేస్తూ మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా, బస్టాండ్‌లో రాస్తారోకో చేపట్టారు. రీసర్వేలో భూముల వివరాలు సక్రమంగా లేవని వాటిని పరిష్కరించాలని రాస్తారోకో చేపట్టారు. తహసీల్దార్ కుమారస్వామి వచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

వైభవంగా కాశీంతాత ఉరుసు

మద్దికెర: బసినేపల్లిలో కాశీంతాత ఉరుసు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం పూలతో అలంకరించిన స్వామి వారి షంషీర్‌ను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. అనంతరం దర్గాలో భక్తులు చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అట్టహాసంగా క్రీడా పండుగ

- ఏపీని క్రీడా శక్తిగా మార్చడమే లక్ష్యం
- ఆటలను ప్రోత్సహిస్తూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేలా పోటీలు
- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



పత్తికొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ టౌన్: గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 'ఆడుదాం–ఆంధ్రా' పేరుతో టోర్నమెంట్‌ను ప్రభుత్వం నిర్వహించడం దేశంలోనే ప్రథమమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం క్రీడాపోటీల ప్రారంభోత్సవం పురస్కరించుకుని ఆమె పత్తికొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో విప్లవాత్మక విధానాలతో ప్రజలకు మేలు చేకూరుస్తున్నారన్నారు. క్రీడలతో విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేలా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి నాంది పలికారన్నారు. ప్రపంచ స్థాయికి ఎదిగిన క్రీడాకారులు, అనేక ఫ్రాంచైజీలు ఆడుదాం – ఆంధ్ర కార్యక్రమానికి మార్గదర్శకత్వం వహిస్తున్నారని, క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొని సత్తా చాటుకుంటే మెరుగైన అవకాశాలు పొందవచ్చని వివరించారు. ఎంపీపీలు నారాయణదాసు, డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగడు, బీసీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్, భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: క్రీడాస్ఫూర్తితో ఆటలు ఆడి జీవితంలో కూడా విజయ తీరాలకు చేరాలని ఆర్డీఓ నీలపు రామలక్ష్మి క్రీడాకారులకు పిలుపునిచ్చారు. పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడాపోటీలను ఆమె ప్రారంభించారు. ఎంపీడీఓ కవిత, ఎంపీపీ నారాయణదాస్, సర్పంచు కొమ్ము దీపిక, తహసీల్దారు విష్ణుప్రసాద్, ఎంఈఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో క్రీడాపోటీలను మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కమిషనర్ గంగిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, స్పెషల్ ఆఫీసర్ సలీంబాష, తహసీల్దార్ ఆంజినేయులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అలాగే సోగనూరు జెడ్పీ క్రీడా మైదానంలో ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఎంపీడీఓ బంగారమ్మ, ఎంఈఓ ఆంజినేయులు, వక్ఫ్‌బోర్డ్ జిల్లా ఉపాధ్యక్షులు రియాజ్‌అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: స్థానిక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలను జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు బందెనవాజ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలోని 18 సచివాలయాల పరిధిలో క్రీడా సంబరం ప్రారంభమైంది. స్థానిక బాలుర హైస్కూల్ మైదానంలో క్రీడాపోటీలను ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఈడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసకుమార్, జెడ్పీటీసీ సుంకన్న ప్రారంభించారు. తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్ నాయుడు క్రీడా జ్యోతి వెలిగించి ఎన్‌సీసీ బాలురకు అప్పగించారు. క్రీడాకారులకు అధికారులు, సిబ్బంది తాగునీరు, భోజన సౌకర్యం కల్పించారు. అలాగే చెరుకులపాడులో జరిగిన పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకుడు కంగాటి శివారెడ్డి ప్రారంభించారు.

ఆస్పరి: మండలంలోని అన్ని గ్రామాలలో క్రీడాపోటీలు ప్రారంభమైనట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. మొదటి రోజు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆస్పరిలో తహసీల్దార్ కుమారస్వామి సరదాగా కబడ్డీ ఆడారు. సర్పంచ్ మూలింటి రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి: స్థానిక జూనియర్ కాలేజీ మైదానంలో మంగళవారం ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, కన్వీనర్ మారయ్య ఆడుదాం – ఆంధ్ర లోగో ఆవిష్కరించి క్రీడలు ప్రారంభించారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంఈఓ బాలనాయుడు, సర్పంచ్ గోవిందరాజులు పాల్గొన్నారు.

హాలహర్వి: మండలకేంద్రంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మహేంద్ర, జెడ్పీటీసీ లింగప్ప, ఎంపీడీఓ ఆంతోనీ క్రీడాపోటీలు ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు క్రీడాకారుల నుద్దేశించి మాట్లాడారు. తహసీల్దార్ మల్లికార్జున, మండల కన్వీనర్ భీమప్పచౌదరి, నాగేంద్ర, కృష్ణ, తదితరులు ప్రారంభించారు.

హొళగుంద: గ్రామీణ యువకుల్లో క్రీడా నైపుణ్యం వెలికి తీయడంతో పాటు వారు ఆరోగ్యంగా ఉండేలా 47 రోజుల పాటు క్రీడా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. హొళగుంద జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ, ప్రత్యేక అధికారి మోహన్‌కుమార్, ఎంపీడీఓ సుభాషిణి పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలో క్రీడాపోటీలను జెడ్పీటీసీ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున ప్రారంభించారు. ఎంపీడీఓ గౌరీదేవి, తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: స్థానిక ప్రభుత్వ కళాశాల ఆవరణలో క్రీడా పోటీలను వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ నారాయణ స్వామి, మండల కన్వీనర్ వీరేష్ ప్రారంభించారు. ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్, ఎంఈఓ కోమలాదేవి, తదితరులు పాల్గొన్నారు. అందకుముందు వాలీబాల్, షటిల్, క్రికెట్, కబడ్డీ ఆటలు ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు.

తుగ్గలి: మండలంలోని ఆయా సచివాలయాల్లో అట్టహాసంగా క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. జొన్నగిరిలో తహసీల్దార్ రవి, పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో ఈవోపీఆర్డీ తిరుపాల్, ఆయా సచివాలయాల కన్వీనర్లు పాల్గొని పోటీలను ప్రారంభించారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం గ్రామాల్లో క్రీడాపోటీలను జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం తదితరులు ప్రారంభించారు. సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, విజయుడు, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను మండల నోడల్ అధికారి వెంకటలక్ష్మమ్మ, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ రామస్వామి, ఈఓఆర్డీ మురళీమోహన్‌తో కలిసి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి ప్రారంభించారు. సర్పంచ్‌లు బోయ సర్వేశ్వరి, గిరిబాబు, వాణిశ్రీ, మాహదేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నందవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, ఎంపీడీఓ దశరథ రామయ్య ప్రారంభించారు. డీఆర్‌డీఏ– వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా పోటీలను పర్యవేక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో ఆయా క్రీడల్లో 461 మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. పురుషులు 146 జట్లు, మహిళలు 99 జట్లు ఉన్నాయని పేర్కొన్నారు. క్రికెట్‌కు సబంధించి పురుషులు 71 జట్లు 40 మ్యాచ్‌లు, మహిళలు 37 జట్లు 18 మ్యాచ్‌లు, కబడ్డీ బాలురు 62 జట్లకు 38 మ్యాచ్‌లు, మహిళలు 40 జట్లకు 21 మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే బ్యాడ్మింటన్‌లో 54 జట్లు పురుషులకు 30 మ్యాచ్‌లు, మహిళలు 41 జట్లకు 11 మ్యాచ్‌లు ఉంటాయన్నారు. వాలీబాల్ పురుషులు 38 జట్లకు 30 మ్యాచ్‌లు, మహిళలు 38 జట్లకు 19 మ్యాచ్‌లు, ఖోఖో క్రీడకు సంబంధించి పురుషుల జట్లు 45 కాగా 21 మ్యాచ్‌లు, మహిళలు 39 జట్లకు 20 మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు వివరించారు. జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పత్తికొండలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీఓ నీలపు రామలక్ష్మి



గోనెగండ్లలో క్రీడాకారులకు కిట్లు అందజేస్తున్న డీఏఓ వరలక్ష్మి



ఎమ్మిగనూరులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్



చిప్పగిరిలో లోగో ఆవిష్కరిస్తున్న గుమ్మనూరు నారాయణ



వెల్దుర్తిలో క్రీడా జ్యోతి వెలిగించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



హొళగుందలో పావురం ఎగురవేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్



ఆస్పరిలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ మూలింటి రాధమ్మ



దేవనకొండలో బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రామకృష్ణ, అధికారులు



ఆలూరులో క్రీడలను ప్రారంభిస్తున్న నారాయణస్వామి